క్లుప్తంగా

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

కపిలేశ్వరపురం: రానున్న నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ రంగంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని పీడీఎస్‌యూ సీనియర్ నాయకులు సిద్ధూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. వృత్తి విద్యా కోర్సులతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంచే ఆర్ట్స్ కోర్సులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వైద్యవిద్య సామాన్య ప్రజలకు అందని ద్రాక్షగా కూటమి ప్రభుత్వం మార్చేసిందని, ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేసే బాధ్యత నుంచి తప్పుకోవడం సరికాదన్నారు. ప్రైవేటు కళాశాలలో సామాన్యులు రూ.కోట్లను ఖర్చుపెట్టి తమ పిల్లలను డాక్టర్లను చదువించుకోలేరని వాపోయారు. తక్షణమే ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

ముగిసిన వనువులమ్మ జాతర

కపిలేశ్వరపురం: మండలంలోని వాకతిప్ప గ్రామ దేవత వనువులమ్మ జాతర ఉత్సవం సోమవారంతో ముగిసింది. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని భారీ ఎత్తున అమ్మవారి తీర్థాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. జాతరలో గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

39 రోజులుగా మహిళ దీక్ష



కేశవరంలోని 39వ రోజు దీక్ష చేస్తున్న వల్లూరి శ్రీవాణి

కపిలేశ్వరపురం: మండపేట మండలం డి.కేశవరంలో జెడ్పీ ఉన్నత పాఠశాలకు రక్షణ గోడ నిర్మించాలంటూ గ్రామానికి చెందిన మహిళ వల్లూరి శ్రీవాణి చేస్తోన్న రిలే నిరాహార దీక్ష సోమవారంతో 39వ రోజుకు చేరుకొంది. పాఠశాలలోని విద్యార్థుల రక్షణ కోసం గోడ నిర్మాణానికి ఓఎస్‌జీసీ నుంచి నిధులు మంజూరుకు అవకాశమున్న నేపథ్యంలో తన డిమాండ్‌ను త్వరితగతిన పరిష్కరించాలని ఆమె అధికారులను కోరుతున్నప్పటికి అధికారులు ఎవరూ స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా నిధులు మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు.

రాయితీపై పశువుల దాణా



కేదారిలంకలో పశువుల దాణాను అందజేస్తున్న సర్పంచ్, ఏడీఏ

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంకలోని పాడిరైతులకు ప్రభుత్వ రాయితీపై పశువుల దాణాను పంపిణీ చేశారు. సోమవారం పశు సంవర్థక శాఖ ఆలమూరు ఏడీఏ ఎల్.అనిత పర్యవేక్షణలో సర్పంచ్ వీధి వెంకటరెడ్డి చేతులు మీదుగా పాడిరైతులకు దాణాను అందజేశారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ..పాడిపశువుల సంరక్షణకై ప్రభుత్వం కృషి చేస్తుందని డాక్టర్ ఎల్ అనిత అన్నారు. పశువులకు అనారోగ్యానికి గురైనప్పుడు సొంత వైద్యం కాకుండా తమను వెంటనే సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

జూన్ 2న మండల సమావేశం

కపిలేశ్వరపురం: మండపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో జూన్ 2 మధ్యాహ్నం 2.గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన వివిధ ప్రజా సమస్యల పరిష్కరం, అభివద్ధి పనులు నిర్వహణపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ప్రభుత్వ శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఎంపీడీఓ ఆదేశించారు.

ప్రసన్నాంజనేయస్వామికి విశేష పూజలు



వెంటూరు శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి నిర్వహిస్తున్న విశేష పూజలు

రాయవరం: మండలంలోని వెంటూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి జయంతోత్సవాల్లో భాగంగా పంచాహ్నిక దీక్ష సందర్భంగా ఐదవ రోజు స్వామి వారికి విశేష ద్రవ్య అభిషేకం, నాగవల్లీ దళాలు, సింధూరంతో అర్చనలు చేశారు. అనంతరం శాంతి హోమం నిర్వహించారు. వేణుగోపాలాచార్యుల బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు మద్దిరాల సాయికిరణ్‌శర్మ, విజయజనార్దన్ ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి మార్గాలకు మంగళం

- ఇంటింటికీ సరుకులు పథకం రద్దు చేసిన కూటమి ప్రభుత్వం
- జూన్ 1 నుంచి షాపులకు క్యూ కట్టనున్న ప్రజలు
- రెండు నియోజకవర్గాల్లో 119 ట్రక్కులు



పడమర ఖండ్రికలో మినీ ట్రక్కుతో ఇంటి వద్ద బియ్యం పంపిణీ చేస్తున్న సిబ్బంది

మండపేట: ప్రజల ఓట్లతో అధికారం చేపట్టాకా పాలనాకాలమంతా ప్రజలు కోసమే ప్రభుత్వాధినేతలు పనిచేయాలి. ఐదేళ్ల పాటు ఖర్చుకు వెనకాడకుండా ప్రజా సంక్షేమానికి పాటుపడాలి. ప్రస్తుత కూటమి పాలన ఐదేళ్ల మాట అటుంచితే తొలినుంచే సంక్షేమానికి తూట్లు పొడుస్తోంది. ప్రభుత్వ సేవను ఇంటింటికీ తీసుకెళ్లమంటే కూటమి పాలకులకు మంటపుడుతుందే ఏమో ఇంటింటికీ తరహా సేవలను నిర్వీర్యం చేస్తూ వస్తుంది. ఇంటికి తీసుకెళ్లి పింఛన్ సాయం అందేజేసే వలంటీర్ల సేవలకు దూరం పెట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చినదానికి రెట్టింపు గౌరవవేతనం ఇస్తామంటూ ఎన్నికల ప్రచార సభల్లో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కింది. ఇప్పుడు రేషన్ సరుకులను ఇంటికి తీసుకెళ్లి ఇచ్చే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనాలను రద్దు చేసింది. అసంబద్ధమైన కారణాలను చెబుతూ వారి ఉపాధికి గండికొట్టింది. ఇలా ప్రజలతో ఓట్లు వేయించుకుని ఆ ప్రజలకు ఇంటింటికీ సాయాన్ని తీసుకెళ్లి అందజేసే వ్యవస్థలను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తుండటం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

పథకం నేపథ్యమిదీ

రాష్ట్రంలో 2021 జనవరి 21 న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. వాహనాలన్నీ క్షేత్రస్థాయికి చేరుకోగానే ఫిబ్రవరి ఒకటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 12 పట్టణాల్లో ప్రారంభమైంది. పంచాయతీ ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యంగా 23న గ్రామాల్లో ప్రారంభమైంది. పథకం ప్రారంభం నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చివరి రోజు వరకూ దిగ్విజయంగా కొనసాగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 11 నెలలకే పథకాన్ని రద్దు చేసింది.

రెండు నియోజకవర్గాల్లో ప్రయోజనం ఇలా...

మండపేట నియోజకవర్గంలో 147 షాపుల పరిధిలో 65 వాహనాలు ద్వారా 53,651 కుటుంబాల వారు ఇంటింటికీ సరుకులు పంపిణీకి దూరం కానున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 146 షాపుల పరిధిలో 54 వాహనాలు ద్వారా 44,041 కుటుంబాలకు ఇబ్బందులు తలెత్తనున్నాయి.

వాహనాల్లో సరఫరాతో ప్రయోజనం

గత టీడీపీ పాలనలో సరుకులు కోసం గంటలు తరబడి ఎండలో లబ్ధిదారులు నిలుచుండేవారు. పనులకు వెళ్లినవారు దుకాణాల నిర్వహణా సమయానికి రాలేకపోయి అవస్థలు పడేవారు. వృద్ధులు, వికలాంగులు నానా యాతన పడేవారు. ప్రజా సంకల్పయాత్ర పేరుతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసినప్పుడు ప్రజల కష్టాలను స్వయంగా చూశారు. పేదల మాటలు విన్న తర్వాత నవరత్నాలు పేరుతో ప్రజా పథకాలను రూపొందించారు. ప్రజల ఆశీర్వాదంతో ఐదేళ్ల పాలన సాగించారు. ఇచ్చిన ప్రతి మాటను అమలు చేసి చూపించారు. అందులో ఇంటింటికీ సరుకులు పంపిణి పథకం ఒకటి. యువకులకు ఉపాధిని చూపిస్తూ ఎండీయూ ఆపరేటర్లను నియమించారు. ప్రభుత్వం తరపున రుణ పద్ధతిలో వాహనాన్ని సమకూర్చారు. పై స్థాయిలో జిల్లా కలెక్టర్ ఆదేశాలపై జాయింట్ కలెక్టర్ పథకం నిర్వహణను పర్యవేక్షించేవారు. ఫలితంగా రెండు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో క్రమం తప్పకుండా ఎండీయూ ఆపరేటర్లు ఒకటో తేదీ నుంచి 17వ తేదీ వరకూ సరుకులను పంపణి చేసేవారు. తూకాల్లో మోసం లేకుండా ఎలక్ట్రానిక్ కాటా ద్వారా లబ్ధిదారుని ఎదురుగా తూకమేయడం ద్వారా పారదర్శకతకు పెద్ద పీటవేసింది. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు దూరాభారం, నిరీక్షణలకు స్వస్తి పలికింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రద్దు నిర్ణయంతో నరక యాతనకు దారితీస్తోంది.

> **ఉపాధి మార్గానికి గండి కొట్టడమే**
>
> 
>
> ఎండీయూ వాహనాల నిర్వహణను రద్దు చేయడమంటే ప్రజా సేవతో పాటు నిర్వాహకుల ఉపాధి మార్గాన్ని దెబ్బతీయడమే అవుతుంది. 2019కి ముందు రేషన్ షాపులు వద్ద వృద్ధులు, దివ్యాంగుల అవస్థలను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల వ్యవస్థను తీసుకొచ్చింది. వాటిని రద్దు చేయడమంటే రేషన్ సరుకులు కోసం యాతనపడటమనేది మళ్లీ మొదలు కాబోతోందని అర్థం చేసుకోవాల్సి వస్తుంది.
>
> – పిల్లా వీరబాబు, పాలతోడు, మండపేట రూరల్ మండలం.

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో రేషన్ వ్యవస్థ ఇలా...

మండలం	షాపులు	ట్రక్కులు	కార్డులు
మండపేట	64	34	25,131
రాయవరం	41	13	12,583
కపిలేశ్వరపురం	42	18	15,937
రామచంద్రపురం	58	24	19,669
కె.గంగవరం	43	15	12,372
కాజులూరు	45	15	12,000
మొత్తం	293	119	97,692

పథకంపై తొలి నుంచి వ్యతిరేక ధోరణి...

జిల్లాలో 5.38 లక్షల రేషన్ కార్డులకు గాను 906 రేషన్ దుకాణాలున్నాయి. వాటి పరిధిలో 355 ఎండీయూ వాహనాల్లో 1,065 మంది సిబ్బంది ఉపాధి పొందుతున్నారు. స్వయంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణితో ప్రభుత్వానికి కోట్లాది రూపాయిలు భారమవుతుందంటూ ప్రకటనలు చేశారు. పథకానికి స్వస్తిపలకనున్నట్టు బాధ్యతను మరచిమరీ పలు మార్లు ప్రకటనలు చేశారు. వాస్తవానికి ఎండీయూ ఆపరేటర్లకు 2027 వరకూ నిర్వహణాపరమైన గడువు ఉంది. అయినప్పటికీ ఈ ఏడాది జూన్ 1 నుంచి పథకాన్ని రద్దు చేస్తూ వారి ఉపాధి మార్గాన్ని కూటమి ప్రభుత్వం ధ్వంసం చేసింది. 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు డోర్ డెలివరీ కొనసాగిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వాహనాలు ద్వారా పంపిణి చేసే వ్యవస్థనే రద్దు చేసిన నేపథ్యంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాహన నిర్వాహకులు జీవనోపాధిని కోల్పోతున్నారు.

మూడో రోజుకు చేరిన సమ్మె



మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కపిలేశ్వరపురం: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష సోమవారంతో మూడోరోజుకు చేరుకుంది. మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు చేస్తున్న నిరసన శిబిరంలో పలు ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కారించే వరకు పొరాటం చేస్తమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కప్పల అన్నవరం, తలాటి వెంకన్న, కప్పల సురేంద్ర, పాలపర్తి సురేష్ కన్న, పిట్టా ప్రవీణ్ కుమార్, గంటి నవీన్ కుమార్, ఖండవిల్లి రాజు, మత్తాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలు



ద్రాక్షారామలో డ్రాయింగ్ పోటీల్లో వేసిన చిత్రాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ అధికారి ములంపాక వీర సూరిబాబు ఆధ్వర్యంలో చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా రిసోర్స్ పర్సన్ మేడిశెట్టి సాయి రాజ్ నేతృత్వంలో జరిగిన ఈ పోటీల్లో చిన్నారుల ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు వేసిన చిత్రాలు అలరించాయి.

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విధానాన్ని కొనసాగించాలి



రామచంద్రపురం ప్రధాన రహదారిలో ర్యాలీ చేస్తున్న సూర్యప్రకాశ్ తదితర పార్టీ నేతలు

రామచంద్రపురం: ప్రజాపంపిణీ వ్యవస్థ, ఇతర సంక్షేమ పథకాల కింద నిత్యావసర వస్తువుల పంపిణీ మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ)లను నిలుపుదల చేస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను వెంటనే నిలుపుదల చేసి యథాస్థితిని కొనసాగించాలని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయం వద్ద ఎండీయూ ఆపరేటర్లలో కలసి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో అఖిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ 2021లో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ పంపిణీ కోసం 9,260 రైస్ మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా సుమారు 18,520 అట్టడుగు వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర కులస్తుల నిరుద్యోగ కుటుంబాలకు జీవనోపాధి కల్పించారన్నారు. 2021 కరోనా సమయంలోను ఇతర ప్రకృతి వైపరీత్యాల్లో (విజయవాడ వరదలు) కూడా వీరు కష్టనష్టాలను, ఒడిదొడుకులను ఓర్చుకుంటూ కరోనా కష్ట సమయంలో రెడ్ జోన్లో కూడా వీరు పంపిణీ చేశారన్నారు. ఆ సమయంలో సదరు అపరేటర్లు కరోనా వ్యాధికి గురి అయినా వారు పంపిణీ చేశారన్నారు. ఆపరేటర్లకు 2027 జనవరి వరకు గడువు ఉన్నప్పటికీ, వారితో ఎలాంటి సంప్రదింపులు గాని, చర్చలు గాని చేయకుండా ఏకపక్ష నిర్ణయంతో వారిని రద్దు చేస్తూ జారీ చేసిన జీవోను తక్షణమే రద్దు చేయాలని సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళి, ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, మూడు మండలాలకు చెందిన పార్టీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

కె.గంగవరం: ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కె.గంగవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వి.చిట్టిబాబు, భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు బి.సిద్ధూ, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు చింతా రాజారెడ్డి తదితరులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 50 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని కేంద్ర ప్రభుత్వం గత ఆరు వారాల నుంచి ఉపాధి కూలీలకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వడం లేదన్నారు. ఉపాధి కూలీలకు డబ్బులు అందక వారు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు వేతనం ప్రతి వారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తక్షణమే కె.గంగవరం మండల పరిధిలోని కూలీలకు రూ.3.30 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరకుల రేట్లకు అనుగుణంగా రోజు వారి వేతనం రూ.307 నుంచి రూ.600కు పెంచాలని వారు కోరారు. దీంతో పాటు ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్ల సమస్యలను కూడా పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు, ఉపాధి సిబ్బందికి వినతిపత్రాలు అందించారు. కూలీలు శేషారావు, జె.ప్రసాద్, బి.ధనరాజు, వై.రాజారావు, ఎ.సత్యనారాయణ, రావి వెంకట్రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మరో ఇద్దరి అరెస్ట్

- గత నెల 23న గంజాయి అక్రమ రవాణా
- ఆరుగురు నిందితుల అరెస్ట్
- పరారీలో ఉన్న మరో ఇద్దరు



స్వాధీనం చేసుకున్న గంజాయి, వివరాలు వెల్లడిస్తున్న సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబు

రాయవరం: గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఘటనలో గతంలో నమోదు చేసిన కేసులో తప్పించుకుని తిరుగుతున్న ఇరువురు నిందితులను సోమవారం ఆరెస్ట్ చేసినట్లు మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబులు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌బీ ప్రసాద్ సూచనల మేరకు, రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ పర్యవేక్షణలో ఈ అరెస్టులు చేశామన్నారు. గత నెల 23న గంజాయిని అక్రమంగా తరలిస్తున్న సమయంలో పోలీసులు దాడి చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ ఘటనలో ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్ట్ చేయగా, ప్రస్తుతం అరెస్ట్ చేసిన ఇరువురు నిందితులతో ఆరుగురు అరెస్ట్ అయినట్లు అయ్యింది. కేసుకు సంబంధించి మరో ఇరువురు నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉంది. సోమేశ్వరం గ్రామ పరిధిలోని సీతమ్మపేట వద్ద పరారీలో ఉన్న పసలపూడికి చెందిన పచ్చిమాల సురేష్, సోమేశ్వరం గ్రామానికి చెందిన పసుపులేటి బాలాజీప్రసాద్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 450 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్ట్ చేసిన నిందితులను కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబులు మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల బారిన పడి యువత భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకుని రావాలన్నారు.

ముగిసిన అమ్మవార్ల తీర్థ మహోత్సవాలు



ఆర్యావటంలో పోలేరమ్మ తల్లి ఆలయం ఎదుట దర్శనానికి బారులు తీరిన భక్తులు



ద్రాక్షారామ బెస్తపేటలో గొల్లమారెమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన తీపి కావడి

కాజులూరు: మండలంలోని ఆర్యావటం, కోలంకల్లో గత మూడు రోజులుగా జరుగుతున్న గ్రామదేవతల జాతర మహోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఆర్యావటంలో సుమారు 300 ఏళ్ల క్రితం వెలసిన పోలేరమ్మ తల్లిని ప్రజలు గ్రామదేవతగా కొలుస్తారు. ఏటా వైశాఖ మాసం అమావాస్య రోజున అమ్మవారికి తీర్థమహోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఇందులో బాగంగా శనివారం రాత్రి చిన్న జాతర, ఆదివారం రాత్రి పెద్ద జాతర నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలతో అమ్మవారిని తెల్లవారే వరకు గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం సోమవారం వేకువ జాము నుంచి ఆలయం వద్ద తీర్థమహోత్సవాలు నిర్వహించారు. ఆలయం కాకినాడ, కోటిపల్లి ప్రధాన రహదారిని ఆనుకుని ఉండటంతో ట్రాఫిక్ తలెత్తకుండా గొల్లపాలెం పోలీసులు తగిన బందోబస్తు నిర్వహించారు. అదే విధంగా మండలంలోని కోలంకలో సుమారు 400 ఏళ్ల క్రితం వెలసిన కోలపిల్లమ్మ అమ్మవారిని ప్రజలు గ్రామదేవతగా కొలుస్తారు. ఆదివారం రాత్రి గ్రామంలో జాతర మహోత్సవాలను నిర్వహించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలతో అమ్మవారిని తెల్లవారే వరకు గ్రామ వీధుల్లో ఊరేగించిన భక్తులు సోమవారం వేకువ జాము నుంచి ఆలయాల వద్ద తీర్థమహోత్సవాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తీర్థ మహోత్సవాలకు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గొల్ల మారెమ్మ తల్లి సంబరం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామలో బెస్తపేటలో వేంచేసిన గొల్లమారెమ్మ తల్లి సంబరం ద్రాక్షారామ ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని, ఆలయాన్ని సుందరంగా పూలదండలతో అలంకరించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కులదైవం, బెస్తవారి ఇలవేల్పు అయిన మారెమ్మ తల్లికి పుట్టింటి సారె కింద మాకం కామేశ్వరరావు, పద్మావతి దంపతులు, కుటుంబ సభ్యులు తీపి కావడి సమర్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గొల్లపాలెంలో వ్యాపారసంస్థల బంద్



స్వామి మృతికి సంతాపంగా బంద్ నిర్వహించి దుకాణాలను మూసివేసిన వ్యాపారులు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం తదితర గ్రామాల్లో సోమవారం వ్యాపార సంస్థలు బంద్ నిర్వహించాయి. గొల్లపాలేనికి చెందిన మండల వర్తక సంఘం సభ్యుడు కొల్లుశెట్టి సత్యం (పలావు సెంటర్ స్వామి) శనివారం రాత్రి కరప మండలం గొర్రిపూడి వద్ద తుల్యభాగ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. ఆదివారం పోలీసులు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో కాకినాడ రెస్క్యూ టీమ్ వచ్చి హైస్పీడ్ బోట్లతో కాలువను జల్లెడ పట్టి వెతకగా ఆదివారం సాయంత్రం తణుకువాడ, గొర్రిపూడి గ్రామాల సరిహద్దులో స్వామి మృతదేహం లభించింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా సోమవారం స్వామి పార్థివదేహం గ్రామానికి చేరుకుంది. కుటుంబ సభ్యులు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. వర్తక సంఘ నిర్వహణలో కీలకంగా వ్యవహరించే స్వామి అకాల మరణానికి సంతాపంగా వర్తక సంఘం బంద్ ప్రకటించింది.

జామియా మసీదు అధ్యక్షుడిగా అహ్మద్



రామచంద్రపురం: పట్టణంలోని జామియా మసీద్ నూతన అధ్యక్షుడిగా ఎస్ఎం అహ్మద్ నియమితులయ్యారు. ఈ మేరకు జమాత్ కమిటీ అహ్మద్‌ను నియమించినట్లు సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఇప్పటివరకు అబ్దుల్ కరీం అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన స్థానంలో అహ్మద్ నియమితులయ్యారు. అహ్మద్ మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఎస్‌బీఐ మేనేజర్‌కు సత్కారం



ఏడిదలో సీజీఎం నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

కపిలేశ్వరపురం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముంబయి హెడ్ క్వార్టర్స్‌లో జనరల్ మేనేజర్ స్థానం నుంచి చీఫ్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందిన ఎస్వీఎస్వీ నాగేశ్వరరావును ఏడిదలోని డాక్టర్ దాసరి నారాయణరావు భవన్ నిర్వాహకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కామన ప్రభాకరరావు మాట్లాడుతూ నాగేశ్వరరావు బ్యాంకింగ్ రంగంలోనే కాకుండా గొప్ప కవి, రచయితగా ప్రతిభగలవారన్నారు. ఏడిద గ్రామంలో బ్యాంకింగ్ వ్యవస్థకు సంబంధించిన పలు సమస్యలను సీజీఎం నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ డీఎన్ఆర్ ట్రస్టుతో కామన ప్రభాకరరావు చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రసంశించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తాడి సత్యనారాయణ రెడ్డి, పి.సత్యనారాయణ, పర్వతిన వీర వెంకట సత్యనారాయణ, వాసిరెడ్డి బాబురావు. ముగ్గుళ్ల శ్రీను, మీసాల బాబీ, మగ్గం జాకబ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీలు



మండపేట పట్టణంలోని పదార్థాల తయారీని పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

కపిలేశ్వరపురం: మామిడి తదితర పండ్లును మగ్గబెట్టేందుకు కార్బైడ్‌ను వాడినా, హోటళ్లలో ఆహార పదార్థాలను వండటానికి కల్తీ పదార్థాలను వాడినా చట్ట పరిధిలో చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కేశవ ప్రసాద్ హెచ్చరించారు. మండపేట పట్టణంలోని పండ్లు దుకాణాలను సోమవారం కమిషనర్ టీవీ రంగారావుతో కలిసి ఆయన తనిఖీలు చేశారు. మామిడిపండ్లును పరిపక్వతకు తెచ్చేందుకు కార్బైడ్‌ను వినియోగిస్తాన్నారా అన్న కోణంలో దుకాణాలు, హోటళ్లలో తనిఖీలు చేపట్టారు. హోటళ్లలో ఆహార పదార్థాలను వండేందుకు వాడుతున్న నూనెలు, ఇతర పదార్థాలను పరిశీలించారు. పట్టణంలోని ద్వారకామాయి, ఆర్కే, సితార, కాశీ అన్నపూర్ణ, శ్రీవెంకటేశ్వర, భాస్కరరావు హోటళ్లలో తనిఖీలను చేసిన అనంతరం హోటళ్ల యాజమానులకు పలు సూచనలు చేశారు. తనిఖీ ప్రక్రియలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.